సాక్షి పెద్దపల్లి

మంగళవారం । 15 । ఆగస్టు । 2023



గాంధీ చిత్ర ప్రదర్శన

పెద్దపల్లిరూరల్: స్వాతంత్య్ర వేడుకల్లో భాగంగా సోమవారం గాంధీ చలనచిత్రాన్ని సినిమాహాళ్లలో ప్రదర్శించగా విద్యార్థులు తిలకించారు. ఆర్డీఓ మధుమోహన్, డీఈఓ మాధవి పాల్గొన్నారు.



మానవతావాది గద్దర్

రామగిరి: గద్దర్ మానవతావాది అని జెడ్పీ చైర్మన్ పుట్ట మధు అన్నారు. తెలంగాణ చౌరస్తాలో బీఆర్ఎస్, టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో గద్దర్ సంస్మరణ సభ నిర్వహించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
31.0/25.0

వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. కొన్నిచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కలెక్టర్‌ను కలిసిన రామగుండం కమిషనర్



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న కమిషనర్ నాగేశ్వర్

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సీహెచ్.నాగేశ్వర్, సోమవారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. డిప్యూటీ కమిషనర్ త్రియంబకేశ్వర్ రావు కూడా పాల్గొన్నారు.

బల్దియాకు 29 మంది వీఆర్‌ఏలు సర్దుబాటు



రిపోర్టు కాపీలు సమర్పిస్తున్న వీఆర్‌ఏలు

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థకు 29 మంది వీఆర్‌ఏలను కేటాయించారు. వీరంతా సోమవారం కార్పొరేషన్ కమిషనర్ సీహెచ్.నాగేశ్వర్‌ను కలిసి విధుల్లో చేరారు. ఇన్‌వార్డులో జాయినింగ్ రిపోర్టును సమర్పించారు. 19మందిని వార్డు ఆఫీసర్ పోస్టులో, ఏడుగురిని పీహెచ్ వర్కర్లుగా, ముగ్గురిని అటెండర్లుగా భర్తీ చేశారు.

ప్రభుత్వంపై నమ్మకంతోనే చేరికలు



యువకులతో ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి

కాల్వశ్రీరాంపూర్: తెలంగాణ ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలకు ఆకర్షితులవుతున్న యువత బీఆర్ఎస్‌లో చేరుతున్నారని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి అన్నారు. మండలంలోని మీర్జంపేట, మల్యాల, కిష్టంపేట, కాల్వశ్రీరాంపూర్ గ్రామాలకు చెందిన పలువురు యువకులు పార్టీలో చేరగా.. కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో కె.సాగర్, అజయ్, కుమార్, ప్రశాంత్, వేణు, ప్రకాశ్, అరవింద్, సూర్య, రవి, క్రాంతి, వంశీ, నిరంజన్, హరీష్, నితీశ్, రిత్విక్, రాజ్‌కుమార్, సంపత్, హర్షవర్ధన్, అశోక్, సునిల్ తదితరులు ఉన్నారు.

16 నుంచి సెకండ్ ఏఎన్ఎంల సమ్మె



వినతిపత్రం అందిస్తున్న సెకండ్ ఏఎన్ఎంలు

సుల్తానాబాద్ : సమస్యల పరిష్కరించాలని కోరుతూ ఈనెల 16 నుంచి సమ్మెకు దిగుతున్నట్లు సెకండ్ ఏఎన్ఎంలు స్పష్టం చేశారు. ఈ మేరకు ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షురాలు స్వరూప ఆధ్వర్యంలో సోమవారం సుల్తానాబాద్ తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డికి సమ్మె పత్రం అందించారు. 15 ఏళ్లుగా ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరవేయడంలో కీలకపాత్ర పోషిస్తున్నా.. ఏఎన్ఎంలు లేని గ్రామాల్లో అన్ని పనులు చేస్తున్నా.. ప్రభుత్వం పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ సిబ్బందిని రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చి విస్మరించిందన్నారు. కార్యక్రమంలో కవిత, వీణ, రాజేశ్వరి, భూలక్ష్మి రమాదేవి, పద్మాంజలి, శారద, అరుణ, రాజు భాయ్, భారతి తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో పర్యటించిన డీఎల్‌పీవో

ధర్మారం: మండలంలోని వివిధ గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు, పంచాయతీ కార్యదర్శుల పనితీరును డీఎల్‌పీవో వేణుగోపాల్ పరిశీలించారు. బంజేరుపల్లి, నర్సింగాపూర్, ధర్మారం, గోపాల్‌రావుపేట, చామనపల్లి, న్యూకొత్తపల్లి, కొత్తపల్లి, మల్లాపూర్, లంబాడి తండాబీ, రచ్చపల్లి, రామయ్యపల్లి, నాయకంపల్లిలో చేపట్టిన వైకుంఠదామం, కంపోస్టు షెడ్స్, పల్లెప్రకృతి వనం, నర్సరీ, కమ్యూనిటీ అవెన్యూ ప్లాంటేషన్‌ను పరిశీలించారు. ఎంపీడీవో జయశీల, ఎంపీఓ రమేష్, డిప్యూటీ రేంజ్ అధికారి స్వాతి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అదనపు కలెక్టర్లు శ్యాంప్రసాద్‌లాల్, అరుణశ్రీ







స్వాతంత్య్ర వేడుకలకు ముస్తాబైన మైదానం

స్వాతంత్య్ర వేడుకలకు ముస్తాబు

కలెక్టరేట్ ఆవరణలోని పోలీస్ పరేడ్‌గ్రౌండ్ స్వాతంత్య్ర వేడుకలకు ముస్తాబైంది. ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో స్టాళ్లు ఏర్పాటు చేశారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనల కోసం మైదానాన్ని సిద్ధం చేశారు. వేడుకల ముఖ్య అతిథిగా శాసనమండలి చీఫ్‌విప్ తానిపర్తి భానుప్రసాద్ రావు హాజరవుతున్నారని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తారని, జాతీయ జెండాను ఆవిష్కరిస్తారని, జిల్లా ప్రగతిని వివరిస్తారని పేర్కొన్నారు. ఉత్తమ ఉద్యోగులు, సిబ్బందికి ప్రశంసపత్రాలు అందిస్తామని వెల్లడించారు.

– పెద్దపల్లి రూరల్

మలివిడతకు కసరత్తు



మొదటివిడత దళితబంధు యూనిట్లు పంపిణీ చేస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్ (ఫైల్)

- దళితబంధు కోసం ఆశావహుల ఎదురుచూపులు
- క్యాంపు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు
- దరఖాస్తు, ఎంపిక బాధ్యతపై అయోమయం
- రెండో విడుత నియోజకవర్గానికి 1100 యూనిట్లు

సాక్షి, పెద్దపల్లి: రెండోవిడత దళితబంధు అమలుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. అయితే విధివిధానాలపై స్పష్టత లేకపోవడంతో ఆశావహుల్లో అయోమయం నెలకొంది. దళితబంధు పథకంలో మొదటివిడత యూనిట్లను గ్రౌండింగ్ చేసిన ప్రభుత్వం.. రెండోవిడుత దరఖాస్తుల స్వీకరణకు పచ్చజెండా ఊపింది. రెండో విడతలో నియోజకవర్గానికి 1100యూనిట్లు మంజూరు చేస్తూ.. ఒక్కో యూనిట్‌కు రూ.10లక్షలు అందించాలని నిర్ణయించింది. తొలివిడత కొన్ని గ్రామాలకే పరిమితం కావడం.. రెండోవిడతలో లబ్ధిదారుల సంఖ్యను పెంచడంతో ఎక్కువ మంది ఈ సాయం కోసం ఆతృతగా ఎదురుచూస్తున్నారు. దరఖాస్తులు, ఎంపిక బాధ్యతలపై అధికారుల నుంచి స్పష్టతలేకపోవడంతో అధికారులు, ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ప్రకటన వెలువడినప్పటి నుంచి ఇప్పటి వరకు ఎవరికి దరఖాస్తు చేసుకోవాలో అర్థం కాక లబ్ధిదారులు అయోమయానికి గురవుతున్నారు. మొదటి విడతలో స్థానిక ఎమ్మెల్యేలు సిఫార్సు చేసిన వారికి మాత్రమే యూనిట్లు దక్కాయనే ఆరోపణలు వినిపించాయి. పైగా యూనిట్‌కు రూ.3లక్షల వరకు వసూలు చేశారని సీఎం కేసీఆర్ స్వయంగా పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం రెండో విడత ఎంపిక బాధ్యతలను కలెక్టర్లకు అప్పగించింది. ఇంతవరకు సజావుగానే ఉన్నా.. స్థానిక ఎమ్మెల్యే సిఫార్సు లేకుండా స్వతంత్రంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తారా..? అనే విషయంలో అనుమానాలున్నాయని దళిత సంఘాలు అంటున్నాయి.

ఎన్నికల కోడ్‌పై ఉత్కంఠ

- మొదటివిడతలో దళితులు తక్కువగా ఉన్న గ్రామాలను ఎంపిక చేసి ఎక్కువ మందికి లబ్ధి చేకూర్చేలా చేశారు. కానీ రెండోవిడత 1100 మంది చొప్పున అందిస్తామని ప్రకటించడంతో ఆశావహుల సంఖ్య భారీగా పెరుగుతోంది. దీంతో రెండో విడతలో చోటు కోసం కొందరు ఎమ్మెల్యేల చుట్టూ తిరుగుతున్నారు, మరికొందరు లిస్టులో పేరులేకపోతే పార్టీ మారుతామని ఎమ్మెల్యేలకే ఝలక్ ఇస్తున్నారు. ఎన్నికల కోడ్ ఏ క్షణంలోనైనా వచ్చే అవకాశాలున్న నేపథ్యంలో త్వరగా ఎంపిక చేసి, యూనిట్లు పంపిణీచేయాలని ఆశావహులు కోరుతున్నారు.

ప్రక్రియ ప్రారంభం



మొదటివిడత జిల్లాలో 259 యూనిట్లను సమర్థవంతంగా పంపిణీ చేసి పూర్తి చేశాం. రెండోవిడత దళితబంధుకు సంబంధించిన ప్రక్రియ కొనసాగుతోంది. ప్రభుత్వ ఆదేశాలతో పంపిణీ చేపడుతాం.

– మధుసూదన్ శర్మ, ఈడీ, ఎస్సీ కార్పొరేషన్

మొదటి విడతలో ఇలా..

జిల్లాలో 1,49,994 మంది దళితులున్నారు. మొదటి విడతలో రామగుండం నియోజకవర్గానికి 100, పెద్దపల్లికి 100, మంథనికి 40, ధర్మపురి నియోజకవర్గంలోని ధర్మారం మండలానికి 19 కలిపి మొత్తం 259 యూనిట్లను గతేడాది జూలై 29న పంపిణీ చేశారు. రెండోవిడతలో ప్రతి నియోజకవర్గానికి 500 యూనిట్లు కేటయిస్తామని ప్రకటించినా ఎంపిక చేసేది ఎమ్మెల్యేనా..? లేక అధికారులా..?అనేది స్పష్టత లేక ఆశావహులు కార్యాలయాలు, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

ప్రజావాణి సమస్యలకు పరిష్కారం చూపాలి



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అడిషనల్ కలెక్టర్లు అరుణశ్రీ, శ్యాంప్రసాద్‌లాల్

- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

పెద్దపల్లిరూరల్: ప్రజావాణిలో ప్రజలు అందించిన దరఖాస్తులకు సత్వర పరిష్కారం చూపాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ అరుణశ్రీ, శ్యాంప్రసాద్‌లాల్‌తో కలిసి అర్జీలు స్వీకరించారు. అర్జీలకు ప్రాధాన్యతనిచ్చి సకాలంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూశాఖకు సంబంధించినవి 45, ఇతర శాఖలవి 16 దరఖాస్తులు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. సదరం సర్టిఫికెట్‌లో 52 శాతం అంగవైకల్యం ఉందని, దివ్యాంగుల పింఛన్ మంజూరు చేయాలని మంథని మండలం ఆరెందమల్లారం గ్రామానికి చెందిన జక్కుల కిష్టక్క కలెక్టర్‌ను కోరారు. నిరుపేద దళిత కుటుంబానికి చెందిన తనకు దళితబంధు పథకం కింద కిరాణ షాపు ఇప్పించాలని గోదావరిఖనిలోని శ్రీనగర్ కాలనీకి చెందిన లక్ష్మణ్ వినతిపత్రం అందించారు.

'సిమ్స్'ను తనిఖీ చేసిన చీఫ్ ఇంజినీర్

కోల్‌సిటీ: గోదావరిఖనిలోని సింగరేణి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (సిమ్స్)లో నిర్మిస్తున్న భవనం పనులను రోడ్లు, భవనాల శాఖ చీఫ్ ఇంజినీర్ పి.సతీశ్ సోమవారం తనిఖీ చేశారు. కాలేజీ ఆవరణలో ఇప్పటికే నిర్మించిన భవనాలు, నిర్మిస్తున్న వాటి వివరాలను అధికారుల ద్వారా తెలుసుకున్నారు. గౌతమినగర్ ప్రధాన రహదారిని పరిశీలించారు. ఈఈలు సాయేల్, నర్సింహాచారి, డీఈ జాఫర్, ఏఈ జావిద్ పాల్గొన్నారు.



నిర్మాణ పనులను తనిఖీ చేస్తున్న సతీశ్

కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- డీసీసీ అధ్యక్షుడు ఎంఎస్ రాజ్‌ఠాగూర్



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న రాజ్‌ఠాగూర్

గోదావరిఖని: రానున్న ఎన్నికల్లో రామగుండంలో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని డీసీసీ అధ్యక్షుడు ఎంఎస్ రాజ్‌ఠాకూర్ కోరారు. సోమవారం స్థానిక అడ్డగుంటపల్లిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్‌లో చేరగా కండువాలు కప్పి ఆహ్వానించారు. కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకొచ్చి తొమ్మిదేళ్లు గడిచినా అభివృద్ధి శూన్యమని, అన్ని రంగాల ప్రజలు గోస పడుతున్నారని పేర్కొన్నారు. కేసీఆర్ ప్రభుత్వంపై ప్రజలు విసుగుచెందారని పేర్కొన్నారు. ప్రతి కుటుంబానికీ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. మేకల రవి, చిత్రవేణి క్రాంతి, పర్వతాలు, ఐలయ్య, చిన్న కుమార్ పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. నాయకులు మహంకాళి స్వామి, ముస్తాఫా, మారెల్లి రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంచం పట్టిన తెనుగుపల్లె



సిబ్బందికి సూచనలు చేస్తున్న జిల్లా మలేరియా నివారణ అధికారి రాజమౌళి

ధర్మారం: మండలంలోని నందిమేడారం పరిధి తెనుగుపల్లెలో ఇంటింటికీ జ్వరాలు ప్రబలుతున్నాయి. ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి సమీపంలోనే ఉన్న ఆ పల్లెలు జ్వరాలు వస్తున్నా వైద్య సిబ్బంది పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇటీవల కురిసన వర్షాలకు నీటిగుంతల్లో నీరు నిలిచి ఇళ్ల పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. పాతకుండల్లో నీరు ఉండి దోమలు వృద్ధి చెందాయి. సిరవేని రాజేశం కూతురు అఖిల, అంజీ విషజ్వరంతో బాధపడుతుండగా.. అప్రమత్తమైన కుటుంబసభ్యులు మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

కొత్తూరులో తగ్గుముఖం పట్టిన జ్వరాలు

మండలంలోని కొత్తూరులో జ్వరాలు తగ్గుముఖం పట్టాయి. 15 రోజుల క్రితం గ్రామంలో విషజ్వరాలతోపాటు డెంగీ లక్షణాలతో గ్రామస్తులు ఇబ్బంది పడ్డారు. మేడారం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి అనుదీప్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆదేశాల మేరకు రెండు రోజులు ఇంటింటికీ తిరుగుతూ వైద్య పరీక్షలు చేశారు.

మేడారంలో పర్యటించిన జిల్లా మలేరియా నివారణ అధికారి

తెనుగుపల్లెను జిల్లా మలేరియా అధికారి రాజమౌళి సోమవారం సందర్శించారు. విషజ్వరాలు సోకిన ఇళ్ల పరిసరాలను పరిశీలించారు. జ్వరంతో ఆదివారం చనిపోయిన సిరవేణి మైథిలి ఇంటిని సందర్శించి పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నట్లు గుర్తించారు. ఆమె ఇంటిచుట్టూ యాంటీ లార్వెల్ ఆపరేషన్ చేపట్టాలని మండల వైద్యాధికారి అనుదీప్‌కు సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి ఉమామహేశ్వర్, నోడల్ పర్సన్ అట్ల దామోదర్‌రెడ్డి, సూపర్‌వైజర్ జీవరాణి, కార్యదర్శి ముజీవుద్దీన్ ఆశవర్కర్లు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్‌లో కేంద్రబృందం పర్యటన



ఇంకుడు గుంతను పరిశీలిస్తున్న సభ్యులు

కాల్వశ్రీరాంపూర్: స్వచ్ఛసర్వేక్షణ్‌లో భాగంగా కేంద్ర బృందం సభ్యులు కిషోర్, వెంకటేశ్వర్లు మండలకేంద్రంలో సోమవారం పర్యటించారు. వారికి పంచాయతీ పాలకవర్గం బతుకమ్మలతో స్వాగతం పలికింది. పారిశుధ్యం, ఇంకుడుగుంతలు, డ్రైనేజీ, మరుగదొడ్ల నిర్వహణ, తడి, పొడిచెత్త, ఇంటింటి సర్వే, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రి, పెరటి తోటల పెంపకం, ప్రభుత్వ కార్యాలయాలను సందర్శించారు. తాగునీటి సరఫరా, దోమల నివారణ, ఫాగింగ్ మిషన్ల నిర్వహణను పాలకవర్గంతో చర్చించారు. సర్పంచు ఆడెపు శ్రీదేవి, ఎంపీపీ నూనేటి సంపత్ యాదవ్, జెడ్పీటీసీ వంగళ తిరుపతి రెడ్డి, ఎంపీడీవో రామ్మోహనాచారి, డీఆర్‌డీవో శ్రీధర్, డీపీవో చంద్రమోళి, డీఎల్‌పీవో రాంబాబు, ఎంపీవో గోవర్ధన్, వైస్ ఎంపీపీ జూకంటి శిరీష, ఎంపీటీసీ మాదాసు సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

డబుల్ రూం ఇళ్లకే దిక్కులేదు

- మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు



పార్టీలో చేరిన వారితో విజయరమణారావు

సుల్తానాబాద్‌రూరల్: నిరుపేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించి ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఇప్పటివరకు ఆ పని చేయకపోగా.. గృహలక్ష్మి అంటూ మరోసారి మోసం చేసేందుకు వస్తోందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. సుల్తానాబాద్ మండలం నీరుకుల్లలో సోమవారం రాత్రి గడపగడపకూ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాన్ని నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మోసపూరిత హామీలు ఇచ్చిందని విమర్శించారు. అలాంటి సర్కారును ప్రజలు నిలదీయాలని సూచించారు. నాయకులు అంతటి అన్నయ్య గౌడ్, మినుపాల ప్రకాశ్‌రావు, చిలుక సతీశ్, దామోదర్‌రావు, కోటగిరి రమేష్‌గౌడ్, సతీశ్ ఉన్నారు.

పార్టీలో చేరికలు

పెద్దపల్లిరూరల్: విజయరమణారావు ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సిరవేణ స్వప్న, పలువురు మహిళలు, యువకులు కాంగ్రెస్‌లో చేరారు. వారికి విజయ్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు సురేశ్ గౌడ్, కౌన్సిలర్లు సంపత్, సుభాష్‌రావు, మల్లన్న, శ్రీమాన్, బండారి సునిల్, జగదీశ్, మస్రత్, తిరుపతిరావు తదితరులున్నారు.

కుష్టువ్యాధిపై అపోహలు వద్దు

- రోగుల గుర్తింపునకు 517 బృందాలు
- అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ

పెద్దపల్లిరూరల్: కుష్టువ్యాధిపై ప్రజల్లో అపోహలను తొలగించేందుకు ప్రచారం చేయాలని అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ అన్నారు. కుష్టు నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై రాష్ట్ర పరిశీలకులు విజయనిర్మలతో కలిసి జిల్లా సమన్వయ కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పకడ్బందీ చర్యలు చేపట్టి వ్యాధి నియంత్రణకు పాటుపడాలన్నారు. ఈనెలాఖరు వరకు వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు 517 బృందాలను ఏర్పాటు చేశామన్నారు. వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం ఉచితంగా మందులు అందిస్తుందన్నారు. వ్యాధిని తొందరగా గుర్తిస్తే పూర్తిగా కోలుకునే అవకాశముందన్నారు. డీఎంహెచ్ఓ ప్రమోద్‌కుమార్, డీఈఓ మాధవి, వెంకటేశ్వర్లు తదితరులున్నారు.



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ

పీఎం జాతీయ అప్రెంటిషిప్ మేళాకు స్పందన

పెద్దపల్లిరూరల్: జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐలో సోమవారం నిర్వహించిన ప్రధానమంత్రి జాతీయ అప్రెంటిషిప్ మేళాకు విశేష స్పందన లభించింది. కేంద్రప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ స్కిల్ డెవలప్మెంట్ అండ్ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఐటీఐలో జరిగిన మేళాలో ఏడు కంపెనీలు పాల్గొన్నాయని ప్రిన్సిపాల్ నర్సింహాచారి తెలిపారు. 244 మంది అభ్యర్థులు హాజరుకాగా.. 152 మంది ఉద్యోగాలు పొందారని పేర్కొన్నారు.



మేళాకు హాజరైన అభ్యర్థులు

క్లుప్తంగా

బసంత్‌నగర్ ఎస్సైపై డీజీపీకి ఫిర్యాదు

పాలకుర్తి: మండలంలోని క్వారీల్లో అనుమతి లేకున్నా బ్లాస్టింగ్‌లు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోకుండా క్వారీ, క్రషర్ యజమానులకు సహకరిస్తున్న బసంత్‌నగర్ ఎస్సైపై చర్యలు తీసుకోవాలని ముత్తారం మండల కేంద్రానికి చెందిన నాగినేని జగదీశ్వరరావు కోరారు. ఈ మేరకు సోమవారం రాష్ట్ర డీజీపీ అంజనీకుమార్‌ను కలిసి, ఫిర్యాదు చేశారు. కన్నాల బోడగుట్ట క్వారీలకు అనుమతి లేదని, వీటిలో బ్లాస్టింగ్‌లు నిర్వహిస్తే చట్టపరంగా కేసు నమోదు చేయాలని గత ఏప్రిల్‌లో జిల్లా మైనింగ్ అధికారులు ఎస్సైకి లెటర్ పంపించారని తెలిపారు. అయినా నాలుగు నెలలుగా క్వారీల్లో బ్లాస్టింగ్‌లు, బండరాళ్ల వెలికితీత పనులు నిరంతరాయంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఫలితంగా కోట్ల రూపాయల ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోందన్నారు. వెంటనే ఎస్సైపై చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

'పరిమితికి మించి బండరాయి వెలికితీత'

పాలకుర్తి: మండల పరిధిలోని కన్నాల బోడగుట్ట క్వారీల్లో పరిమితికి మించి బండరాయి వెలికితీస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని తెలంగాణ లేబర్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గొర్రె రమేశ్ ఆరోపించారు. సంబంధిత అధికారులు మామూళ్ల మత్తులో తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. సోమవారం బసంత్‌నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. క్వారీలు, క్రషర్ల వల్ల స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పాలకుర్తి మండలంలో ఎన్నో సమస్యలు ఉన్నాయని, కనీసం కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించలేదని పేర్కొన్నారు. స్థానికంగా విమానాశ్రయ ఏర్పాటు విషయంలో ప్రజాప్రతినిధులు వైఫల్యం చెందారని అన్నారు. రాబోయే ఎన్నికల్లో రామగుండం నియోజకవర్గం నుంచి తనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. నాయకులు అఖిల్‌వర్మ, కవిత, రజిత, ఓదెలు, రాజేందర్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలు సాధించండి

- ఉపరితల గనుల జీఎం సూర్యనారాయణ రాజు


మాట్లాడుతున్న జీఎం సూర్యనారాయణ రాజు

రామగిరి: నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలని ఉపరితల గనుల జీఎం సూర్యనారాయణ రాజు అన్నారు. సోమవారం ఆర్జీ–3 డివిజన్ పరిధిలోని ఓసీపీ–2లో పర్యటించారు. ఓసీపీ–1, 2 ఉపరితల గనులను సందర్శించి, క్వారీలో నడుస్తున్న షావల్స్, క్రషర్, స్ప్రైడర్ తదితర యంత్రాల పనితీరును పరిశీలించారు. అనంతరం జీఎం కార్యాలయంలో ఆర్జీ–3, ఏపీఏ జీఎంలు సుధాకర్‌రావు, వెంకటేశ్వర్లు, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉపరితల గనుల్లో బొగ్గు, మట్టి తొలగింపు, యంత్రాల వినియోగం, వాటి పనితీరు తదితర అంశాలపై చర్చించారు. రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటివరకు సాధించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలు, నెలవారీ సాధించాల్సిన ఉత్పత్తి, ఉత్పాదకత లక్ష్యాలను వివరించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 100 శాతం లక్ష్యాన్ని సాధించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. ఏరియా ఇంజినీర్ పి.ఎలీషా, ప్రాజెక్టు అధికారులు ఎస్.రాధాకష్ణ, కె.రాజేందర్, ప్రాజెక్టు ఇంజినీర్లు ఆర్.శ్రీనివాస్, ఎం.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మొదట ఆదరించింది సింగరేణి కార్మికులే

- మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ


కార్మికులతో మాట్లాడుతున్న సత్యనారాయణ

గోదావరిఖని: ఎఫ్‌సీఐలో ఇంజినీర్‌గా పని చేస్తున్న తాను ఉద్యోగానికి రాజీనామా చేసి, రాజకీయాల్లోకి వచ్చినప్పుడు మొదటగా ఆదరించి, మున్సిపల్ చైర్మన్‌గా గెలిపించింది సింగరేణి కార్మికులేనని రామగుండం మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ అన్నారు. బొగ్గుబాయి బాటలో భాగంగా సోమవారం జీడీకే–2ఏ గనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరారు. కొంత మంది నాయకులు సింగరేణిని బీజేపీ ప్రైవేట్ చేస్తోందని తప్పుడు ప్రచారం చేస్తున్నారని, దీన్ని నమ్మవద్దన్నారు. కార్మికుల ఇన్‌కంట్యాక్స్ విషయంలో చాలా అన్యాయం జరుగుతోందని, తాను న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు మొలుగూరి వీరన్న, దీటి వెంకటస్వామి, మంచికట్ల బిక్షపతి, సోమారపు అరుణ్‌కుమార్, సంజీవ్, జనగామ రాయలింగు తదితరులు పాల్గొన్నారు.

కేశోరాం కార్మికులను కలిసిన 'సోమారపు'

పాలకుర్తి: బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కర్మాగారం కార్మికులను మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ సోమవారం కలిశారు. తాను ఎమ్మెల్యేగా పని చేసిన కాలంలో కార్మికుల సమస్యలను యాజమాన్యంతో మాట్లాడి, పరిష్కరించానని తెలిపారు. పాలకుర్తి మండలంలోని ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టానన్నారు. రాబోయే ఎన్నికల్లో తనను గెలిపిస్తే మండలాన్ని మరింత అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం బసంత్‌నగర్ రాజీవ్‌నగర్‌లో బీజేపీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. పార్టీ మండల అధ్యక్షుడు పత్తి సంజీవ్, రాష్ట్ర నాయకులు సోమారపు అరుణ్‌కుమార్, నార శంకర్, కొండ నారాయణ, రాజేశం, లక్ష్మణ్, నాగరాజు, బోదాసు సతీశ్, విజేందర్ తదితరులున్నారు.

ఏఐటీయూసీ మహాసభలకు తరలిరండి


మాట్లాడుతున్న సీతారామయ్య

గోదావరిఖని: ఏఐటీయూసీ కేంద్ర మహాసభలను తరలిరావాలని సంఘం ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య కోరారు. సోమవారం గోదావరిఖనిలోని యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 25 నుంచి 27 వరకు మహాసభలు జరుగుతాయన్నారు. 25న సాయంత్రం 4 గంటలకు ప్రదర్శన, 5 గంటలకు గోదావరిఖని చౌరస్తాలో బహిరంగ సభ ఉంటాయని తెలిపారు. రామగుండం రీజియన్‌లోని కార్మికులు అధిక సంఖ్యలో హాజరై, విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రిటైర్డ్ కార్మికులు హెల్త్ కార్డు కోసం దరఖాస్తు చేసుకునేందుకు డిసెంబర్ వరకు గడువు ఉందని, ఎవరైనా ఉంటే చేసుకోవాలని సూచించారు. దంపతులిద్దరికైతే రూ.40 వేలు, ఒకరికైతే రూ.20 వేలు చెల్లిస్తే హెల్త్ కార్డు ఇస్తారన్నారు. దీనిపై రూ.8 లక్షల వరకు చికిత్స అందిస్తారని పేర్కొన్నారు. నాయకులు ఎల్లాగౌడ్, ఆరెల్లి పోషం, రంగు శ్రీనివాస్, స్వామి, ఉప్పులేటి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగొద్దన్నందుకు వ్యక్తి ఆత్మహత్య


శ్రీనివాస్ (ఫైల్)

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని పెగడపల్లి గ్రామానికి చెందిన పంజాల శ్రీనివాస్(48) ఆత్మహత్యాయత్నం చేయగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై శ్రీనివాస్ వివరాల ప్రకారం.. శ్రీనివాస్‌కు భార్య ఇద్దరు పిల్లలున్నారు. అతను మద్యానికి బానిసయ్యాడు. తాగొద్దని కుటుంబసభ్యులు మందలించడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఆదివారం ఇంట్లో ఎవరూలేని సమయంలో గడ్డి మందు తాగాడు. చుట్టుపక్కల వారు గమనించి, సుల్తానాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం కుటుంబసభ్యులు కరీంనగర్ తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి భార్య రమ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

సెప్టెంబర్‌లో ఏరియర్స్ చెల్లించాలని వినతి


వినతిపత్రం ఇస్తున్న పోశం, నాయకులు

గోదావరిఖని: 11వ వేజ్‌బోర్డు ఒప్పందానికి సంబంధించి 23 నెలల ఏరియర్స్ సెప్టెంబర్‌లో చెల్లించాలని ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోశం డిమాండ్ చేశారు. సోమవారం ఏరియాలోని అన్ని గనులపై అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మహేశ్, అశోక్, రంగు శ్రీనివాస్ పాల్గొన్నారు.

బొగ్గుబాయి వార్తలు

సింగరేణికి బకాయిలు చెల్లించాలి


మాట్లాడుతున్న నర్సింహారావు

గోదావరిఖని: సింగరేణికి బకాయిపడిన రూ.22 వేల కోట్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలని సీఐటీయూ అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి, ప్రధాన కార్యదర్శి మంద నర్సింహారావు డిమాండ్ చేశారు. సంస్థలో ఆర్థిక నిల్వలు లేకనే 11వ వేతన బకాయిలు కార్మికులకు చెల్లించడానికి అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారని తెలిపారు. జీడీకే–2వ గనిపై సోమవారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో వారు మాట్లాడారు. సంస్థకు రావాల్సిన బకాయిలను ఎన్నికల కోడ్‌కు ముందే ఇవ్వాలన్నారు. 190/240 మస్టర్లు నిండిన బదిలీ వర్కర్ కార్మికులకు వెంటనే పర్మినెంట్ చేయాలని కోరారు. సీపీఆర్ఎంఎస్ ట్రస్ట్ బోర్డులో కోలిండియాలోని అన్ని సంఘాలకు ప్రాతినిధ్యం కల్పిస్తుండగా, సింగరేణిలో కేవలం గుర్తింపు సంఘానికి అవకాశం కల్పించడం వల్ల కోలిండియా ఒప్పందాలు ఇక్కడ అమలు కావడం లేదని పేర్కొన్నారు. నాయకులు మెండె శ్రీనివాస్, దాసరి మహేశ్, తోట నరహరిరావు, వంగల రాములు, పి.శ్రీనివాస్‌రావు, గౌస్, వంగల శివరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎంపీఎఫ్ వాటా డిపాజిట్ చేయాలి


సీఎంపీఎఫ్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

గోదావరిఖని: సింగరేణి కార్మికుల సీఎంపీఎఫ్ యాజమాన్యం వాటాను వెంటనే చెల్లించాలని యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం గోదావరిఖని సీఎంపీఎఫ్ కమిషనర్ హరిపచౌరిని కలిసి వినతిపత్రం అందజేశారు. సింగరేణి కాంట్రాక్టు కార్మికుల భవిష్యనిధి 12 శాతం, పెన్షన్ 7 శాతం సీఎంపీఎఫ్ విభాగానికి తక్షణమే డిపాజిట్ చేయాలన్నారు. 2017 నుంచి రూ.కోట్లు పెండింగ్‌లో ఉంచి, కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని మండిపడ్డారు. డిపాజిట్ చేయకపోతే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు ఆకుల హరిణ్, సాయవేణి సతీశ్, పల్లె శ్రీనివాస్, పోరండ్ల వెంకటేశం, నూతి శ్రీమన్నారాయణ, మహాత్మ, లింగయ్య, వేల్పుల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'సెక్యూరిటీ సిబ్బందిని విధుల్లోకి తీసుకోండి'

రామగిరి: ఆర్జీ–3 పరిధిలోని సోలార్ పవర్ ప్లాంట్‌లో తొలగించిన సెక్యూరిటీ సిబ్బందిని నూతన కాంట్రాక్ట్ సంస్థ వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఐఎన్టీయూసీ అసంఘటిత కార్మిక సంఘం రామగిరి మండల అధ్యక్షుడు ఉడత శంకర్, జిల్లా కో–ఆర్డినేటర్ బండ కిరణ్ రెడ్డి డిమాండ్ చేశారు. ప్లాంట్‌లో పని చేస్తున్న 43 మంది సెక్యూరిటీ సిబ్బందిని నూతన కాంట్రాక్ట్ సంస్థ తొలగించింది. దీన్ని నిరసిస్తూ సోమవారం ప్లాంట్ వద్ద ఆందోళన చేపట్టారు. సెక్యూరిటీ సిబ్బంది కుటుంబాలు రోడ్డున పడుతాయన్నారు. కాంట్రాక్టు సంస్థ మారితే సిబ్బందిని తొలగించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. విధుల్లోకి తీసుకోకుంటే ఆర్జీ–3 జీఎం కార్యాలయం ఎదుట వారి కుటుంబసభ్యులతో కలిసి పెద్ద ఎత్తున ధర్నా చేపడుతామని హెచ్చరించారు.

ఊబిలో కూరుకుపోయిన వృద్ధుడు

- కాపాడిన టూటౌన్ బ్లూకోల్ట్స్ సిబ్బంది


వృద్ధుడిని బయటకు తీసిన పోలీసులు

యైటింక్లయిన్‌కాలనీ: రామగిరి మండలంలోని ముస్త్యాల శివారు ఓసీపీ–5 సమీపంలోని ఊబిలో ఓ వృద్ధుడు కూరుకుపోయాడు. స్థానికులు రక్షించే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. దీంతో వారు 100కు డయల్ చేయడంతో టూటౌన్ సీఐ వేణుగోపాల్ బ్లూకోల్ట్స్ సిబ్బందిని అప్రమత్తం చేశారు. కానిస్టేబుల్ చల్లూరి రాంచందర్, మల్లేశ్ ఘటన స్థలానికి చేరుకొని, సర్పంచ్, స్థానికుల సహాయంతో వృద్ధుడిని బయటకు తీశారు. బురద తొలగించి, 108 వాహనంలో గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వృద్ధుడి వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు పేర్కొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి


మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాసరావు

రామగుండం: ప్రజల రక్షణే పోలీసుల బాధ్యత అని గోదావరిఖని ఏసీపీ తులా శ్రీనివాసరావు అన్నారు. సోమవారం రామగుండం పోలీస్‌స్టేషన్ పరిధిలో సీఐ చంద్రశేఖర్ గౌడ్, ఎస్సై వెంకట్‌లతో కలిసి కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులు, నేరస్తులు షెల్టర్ తీసుకొని ఉంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. యువత చెడు అలవాట్లకు బానిసగా మారి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే సహకారం అందిస్తామన్నారు. సరైన ధ్రువపత్రాలు లేని 25 బైకులు, రెండు ఆటోలు, ఒక ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. ఎన్టీపీసీ ఎస్సై జీవన్, అంతర్గాం ఎస్సై సంతోష్, గోదావరిఖని వన్ టౌన్ ఎస్సైలు సమ్మయ్య, సుగుణాకర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు నమ్మకం కలిగించాలి

గోదావరిఖని: సహాయం కోసం పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రతిఒక్కరినీ మర్యాదపూర్వకంగా ఆహ్వానించాలని గోదావరిఖని ఏసీపీ తులా శ్రీనివాసరావు అన్నారు. సోమవారం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల పోలీస్‌స్టేషన్లకు చెందిన రిసెప్షన్ అధికారులతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. ప్రజలకు పోలీస్ వ్యవస్థపై నమ్మకం, విశ్వాసం కలిగించడంలో రిసెప్షన్ అధికారి ముఖ్య పాత్ర పోషించాలన్నారు. ఫిర్యాదుల తీవ్రతను బట్టి వెంటనే స్పందించి, పై అధికారులకు లేదా ఇతర వర్టికల్ అధికారులకు తెలియజేయాలని చెప్పారు. రిసెప్షన్ వర్టికల్ ఇన్‌చార్జి, రామగుండం సీఐ చంద్రశేఖర్‌గౌడ్, ఐటీ కోర్ సిబ్బంది, రిసెప్షన్ వర్టికల్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ మోటార్లలోని వైరు చోరీ

ఓదెల: గోపరపల్లెలో పంట చేల వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ మోటార్లలోని వైరును ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారని రైతులు సమ్మయ్య, మల్లేశం, చేరాలు, శ్రీనివాస్ లు తెలిపారు. కాపర్ వైరు కోసమే కరెంటు మోటార్, స్టార్టర్ మధ్యలోని వైరును దొంగిలించారని పేర్కొన్నారు.

యువత చెడు అలవాట్లకు బానిసలవ్వొద్దు

- పెద్దపల్లి ఏసీపీ ఎడ్ల మహేశ్
- జీడీనగర్‌లో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం


మాట్లాడుతున్న ఏసీపీ మహేశ్

పాలకుర్తి: యువత చెడు అలవాట్లకు బానిసలవ్వొద్దని, ఏవైనా సమస్యలు ఉంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలని పెద్దపల్లి ఏసీపీ ఎడ్ల మహేశ్ అన్నారు. సోమవారం పాలకుర్తి మండలంలోని జీడీనగర్‌లో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అపరిచిత వ్యక్తులు, సైబర్ నేరాల పట్ల జాగ్రత్తగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో 100కు డయల్ చేసి, సహాయం పొందాలని కోరారు. వాహనాలు నడిపేటప్పుడు ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, ఈ విషయంలో పోలీసుల సహకారం ఉంటుందన్నారు. సరైన ధ్రువపత్రాలు లేని 46 ద్విచక్రవాహనాలు, ఒక ఆటోను సీజ్ చేసినట్లు తెలిపారు. సీఐ అనిల్‌కుమార్, బసంత్‌నగర్, పెద్దపల్లి, ధర్మారం ఎస్సైలు వెంకటేశ్, మహేందర్, సత్యనారాయణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.













